# అమ్మ

**అ**రణ్యంలా అగమ్యగోచరంలా ఉన్న ఇంటిని సర్దే మహత్కార్యంలో నిమగ్నమై ఉంది భారతి. కొత్త ఇల్లు, కొత్త ప్రదేశం, కొత్త మనుషులు, అయినా తప్పదు. అయిదేళ్ళకి ఓసారి ట్రాన్సఫర్లూ తప్పవు. ట్రాన్సఫర్ అయినప్పుడల్లా ఈ యజ్ఞమూ తప్పదు. ఒక విధంగా అలవాటు అయిపోయింది.

"మీరో రెండురోజులు సెలవుపెట్టి నాక్కాస్త సాయం చెయ్యండీ" అని భర్తని బతిమాలింది.

"చూడమ్మాయ్, నీ ఇంటితాతలా ఉంది. నా ఆఫీసు. కాబట్టి నువ్వు ఇల్లు సర్దుకో. నేను ఆఫీసు సర్దుకుంటాను" అనేసి వెళ్ళిపోయాడు ఆనంద్.

నడుం బిగించి పనిలో జొరబడింది. టైమెంత అయిందో చూసుకోలేదు.

"పక్కింటి అమ్మగారు వచ్చారమ్మా" వచ్చి చెప్పాడు నౌకరు.

కంగారు పడిపోయింది భారతి. "కూర్చోబెట్టు వస్తున్నా!" అని చెప్పి లోపలికి వెళ్ళి మొహం కడుక్కుని తలదువ్వుకుని డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చింది. వచ్చినావిడని చిరునవ్వుతో పలకరించింది.

"నా పేరు మీనాక్షి, పక్కిల్లే మాది" పరిచయం చేసుకుంది ఆవిడ. మాటలు మొదలయ్యాయి. "మీ సొంత ఊరు ఏ ఊరండీ" అడిగింది మీనాక్షి.

"గుంటూరు".

మీనాక్షి మొహం వికసించింది. "అయితే మా జిల్లా వాళ్ళే అన్నమాట. మాది నర్సారావు పేట. మీకు పిల్లలెంతమంది?" మరో ప్రశ్న వేసింది. భారతి ముఖంలో నవ్వు మాయమైంది.

"లేరు" తలొంచుకుని సమాధానం చెప్పింది.

"అరే! పెళ్ళయి చాలా ఏళ్ళయిందనుకుంటానే. అసలు పుట్టనే లేదా! లేకపోతే..." ఆశ్చర్యపోతూ ఆరాలు మొదలెట్టింది మీనాక్షి.

నిట్టూర్పు బలవంతాన అణచుకొంది భారతి. "పెళ్ళైన కొత్తలో ఓ బాబు పుట్టి పోయాడు. తరువాత రెండు ఎబార్షన్స్ అయ్యాయి" ఓపిగ్గా సమాధానం చెప్పింది.

"పాపం! పోనీ ఆయుర్వేద వైద్యం ప్రయత్నించలేకపోయారా. మా ఆడపడుచు తోటికోడలికి ఇలాగే అయితే తెనాలిలో మందిప్పించారు" సానుభూతిగా చూస్తూ సలహా ఇచ్చింది మీనాక్షి.

భరించలేనంత విసుగ్గా వున్నా నవ్వు తెచ్చి పెట్టుకుని మాటమార్చింది భారతి – "మీరు ఇక్కడికి వచ్చి ఎన్నాళ్ళయింది? అందరూ పరిచయమేనా మీకు?"

బోలెడు కబుర్లు చెప్పింది మీనాక్షి! ఊరి వివరాలు చెప్పింది. సాయంత్రం వాళ్ళింటికి టీకి రమ్మని ఆహ్వానించింది. వాచీ చూసుకొని "అరే చాలా సేపయింది వచ్చి! వెళ్తాను" అంటూ లేచింది. గేటుదాకా వెళ్ళి దిగబెట్టి వచ్చింది భారతి. మళ్ళీ పనిలో మునిగిపోయింది.

అన్నీ సర్దుకునేసరికి పదిరోజులు పట్టింది. 'అబ్బ ఒకటేపని' అని విసుక్కున్న భారతి, ఆ పని కాస్తా అయిపోయేసరికి ఏం చెయ్యాలో తోచకుండా తయారైంది.

వంటకి మనిషి, పై పన్లకి మనిషి, తోటమాలి, ఇక తను చేసే పనేముంది? పొద్దున పదింటికి వెళ్తే సాయంత్రం వస్తాడు ఆనంద్. రోజంతా ఖాళీ. మహిళా మండలిలో చేరింది. అందరితోనూ పరిచయం అయింది. అయినా కాలం గడవడం లేదు. అద్దంలా ఉన్న ఇంటిని ఎంతకని సర్దటం! చదివిన పుస్తకాలే ఎంతకని చదవడం. ఇల్లిల్లూ తిరుగుతూ ఊసుపోని కబుర్లు చెప్పడం అంటే భరించలేనంత విసుగు భారతికి.

ఏం చెయ్యాలా అని ఆలోచించి బుర్రబద్ధలు కొట్టుకుంటూ ఉండగా తోచింది చక్కటి ఆలోచన. కాలనీలో బోలెడు బంగళాలున్నాయి. ప్రతి బంగళాకీ రెండేసి ఔట్‌హౌస్‌లు. ఔట్‌హౌసుల్లో బోలెడు మంది పిల్లలు. ఊరికే గాలికి తిరుగుతూ అల్లరి చేస్తుంటారు. వాళ్ళందర్నీ చేరదీసి చదువు చెప్తే?

ఆ సాయంత్రం లాన్లో కూర్చుని టీ తాగుతూ భర్తకు చెప్పింది. "ఓ దివ్యంగా ఉంది. నీ ఆలోచన!" అన్నాడు ఆనంద్.

"అయితే అందరికీ ఫోన్లు చేసి చెప్తాను. వాళ్ళ ఔట్‌హౌస్‌ల వాళ్ళకి చెప్పమంటాను" అంటూ తూరీగలా పరిగెత్తింది భారతి.

భారతి వెళ్ళిన వంక చూసి బరువుగా నిట్టూర్చాడు ఆనంద్. భార్యపట్ల వల్లమాలిన ప్రేమాభిమానాలతో పాటు అమితమైన గౌరవం కూడా ఉంది అతనికి. నిగర్వి. సంస్కారం మూర్తీభవించిన మనిషి.

అందరు ఆడవాళ్ళలాగే భారతికి కూడా పిల్లలంటే ఎంతో ఇష్టం. మొదటిసారి తల్లి కాబోతోందని తెలిసినప్పుడు ఎంత సరదా పడిపోయింది భారతి. కానీ ఘోరమైన నిరాశ పొందాల్సి వచ్చింది. స్టిల్ బర్త్. ఆ తరువాత రెండుసార్లు నిరాశే ఎదురైంది.

పెద్ద పెద్ద డాక్టర్లను సంప్రదించాడు. చివరికి తెలిసింది ఏమిటీ అంటే చక్కటి జంట అని అందరిచేతా ప్రశంసలు పొంది పాలూనీళ్ళలా అన్యోన్యంగా మనసులు కలసిన తమకు పిల్లలు పుట్టరు. పుట్టినా సవ్యంగా ఉండరు.

గరళం లాంటి నిజం! తమ ఇద్దరికీ పిడుగులాంటి వార్త. తను బాధపడ్డాడు. కానీ అది వేరు. భారతి విపరీతమైన మెంటల్ టార్చర్‌ని ఎదుర్కోవలసి వచ్చింది. సూటి పోటీమాటలు, ఉచిత సలహాలు, తలతోకాలేని ఆలోచనలు, అడ్డందిడ్డం ప్రశ్నలూ– ఇవన్నీ పాపం భారతికే.

అయినా భారతి తొణకలేదు. గంభీరంగా పరిస్థితిని ఎదుర్కొంది. ఎవరేమన్నా నవ్వేసి ఊరుకోడం అలవాటు చేసుకుంది. ఏదో వ్యాపకం ఏర్పాటు చేసుకొని కాలక్షేపం చెయ్యటం అలవాటు చేసుకుంది. ఒక ఊళ్ళో జీతం తీసుకోకుండా టీచర్‌గా పనిచేసింది. మరో ఊళ్ళో ఒక స్వచ్ఛంద సంస్థ నడిపే అనాథపిల్లల సెంటర్లోకి వెళ్ళి వస్తూ ఉండేది. ఇప్పుడిదో కొత్త కాలక్షేపం!

భారతి రాకతో అతని ఆలోచనలకి అంతరాయం కలిగింది. భారతి తలపెట్టిన కార్యక్రమం కార్యరూపం దాల్చేసరికి మరో పదిరోజులు పట్టింది. మొత్తం ఇరవై మంది పిల్లలు వచ్చారు.

వయస్సుల ప్రకారం వాళ్ళని మూడు గ్రూపులుగా విభజించింది భారతి. మధ్యాహ్నం రెండింటి నించి మూడున్నర దాకా వాకిట్లో వరండాలో కూర్చోపెట్టి శ్రద్ధగా చదువు చెప్పేది. వెళ్ళబోయే ముందు తలో చాక్లెట్ ఇచ్చేది.

ఈ వ్యాపకం పెట్టుకున్నాక రోజులు హాయిగా గడిచిపోసాగాయి. పొద్దున్నే లేచి స్నానం, పూజ. ఆనంద్ వెళ్ళాక కాసేపు పుస్తకాలు చదువుకోటం, భోజనం

చేశాక కాసేపు విశ్రాంతి. ఆ తరువాత పిల్లలకి చదువు చెప్పటం. తరువాత తోటపని– అదయ్యేసరికి ఆనంద్ వచ్చేస్తాడు.

నెలరోజులు ఇట్టే గడిచిపోయాయి. ఓ రోజు సాయంత్రం తోటలో కూర్చుని గులాబి మొక్కకు పాదుచేస్తోంది భారతి. ఎవరో పిలిచినట్లు అనిపించి అటు చూసింది. గేటు దగ్గర నిలబడి ఉంది ఓ చిన్న పిల్ల.

అటు చూడగానే "ఇట్రా!" చెయ్యి చాపి మరీ పిల్చింది.

వెంటనే అటు వెళ్ళింది భారతి. "ఈ తోట నీదా?" అడిగింది ఆ అమ్మాయి.

పరిశీలనగా చూసింది భారతి. అయిదేళ్ళుంటాయేమో? సన్నగా, మురికిగా ఉంది. పాతగౌను వేసుకుంది. అయినా అందంగానే ఉంది. అసలు పిల్లలకి అందచందాలతో పనేముంది? ఆ పసితనమే అందం. అమాయకంగా చూస్తే ఆ పువ్వుల్లాంటి కళ్ళు, ఏ కల్మషమూ లేని నవ్వే పెట్టని అలంకారాలు.

"ఈ తోట నీదా?" రెట్టించింది.

"అవును నాదే" సమాధానం చెప్పింది భారతి.

"నా కో పువ్వు ఇస్తావా?" ముద్దుగా అడిగింది.

"ఏం చేసుకుంటావ్? తల్లో పెట్టుకుంటావా?"

"ఊహు జేజికి పెడతా! చెప్పింది.

"లోపలికి రా!" అంటూ గేటు తెరిచింది భారతి. లోపలికి వచ్చింది.

"నీ పేరేమిటి?" అడిగింది భారతి.

"పాప" సమాధానం చెప్పింది.

"మీ ఇల్లెక్కడ?" అడిగింది.

"అక్కడ దూరంగా!" చెయ్యి అటుగా చూపించి చెప్పింది.

"నీ కే పువ్వు కావాలి?" అంది భారతి. కళ్ళు విప్పార్చుకుని తోటంతా చూసి చివరికి ఓ గులాబీ పువ్వు ఎంచుకుంది. జాగ్రత్తగా కోసి ఇచ్చింది భారతి. "ఇంకోటి కావాలా?" అడిగింది "వద్దు" అంది పాప.

లోపలికి వెళ్ళి రెండు చాక్లెట్లు తీసుకొచ్చి పాపకి ఇచ్చింది భారతి. కానీ పాప తీసుకోలేదు. "వద్దు మా అమ్మ కోప్పడుతుంది" అంది. "ఫరవాలేదులే. నే నిచ్చానని చెప్పు మీ అమ్మకి" బలవంతంగా ఇచ్చింది భారతి. నేను వెళ్తా అనేసి వెళ్ళిపోయింది పాప.

అది మొదలు రోజూ సాయంత్రం వచ్చేది పాప. కాసేపు భారతితో కబుర్లు చెప్పి ఓ పువ్వూ, రెండు చాక్లెట్లూ తీసుకొని వెళ్ళిపోయేది.

"పాప రేపటి నుంచి మధ్యాహ్నం రారాదూ, చదువుకుందువుగాని" అంది ఓ రోజు. అర్థం కానట్లు చూసింది పాప. అర్థం అయ్యేలా బోధపరిచింది భారతి.

"అమ్మో. అమ్మ కోప్పడదూ" అంది భయంగా. "ఏం కోప్పడదు. చదువుకుంటే మా పాప బంగారు తల్లి అని మెచ్చుకుంటుంది" అంది భారతి.

పాప కళ్ళు మెరిశాయి. "అయితే వస్తా" అంది వెంటనే. "రేపు మధ్యాహ్నం రెండున్నర సైరన్ కూస్తుంది చూడు-అప్పుడు వచ్చేసెయ్. వచ్చేటప్పుడు మీ అమ్మనడిగి పలక, బలం తెచ్చుకో" అని చెప్పింది.

మర్నాడు వచ్చింది. వట్టి చేతుల్తో. "పలక తెచ్చుకోలేదేం" అడిగింది భారతి. "అమ్మేమో ఊరికెళ్ళింది. తాత దగ్గర డబ్బుల్లేవుట. అమ్మ వచ్చాక అడిగి తెస్తాను" అని చెప్పింది.

"సరే పోన్లే. అలా కూర్చో" అని కూర్చోపెట్టి 'చేత వెన్నముద్ద' పద్యం నేర్పించింది భారతి. ఆ సాయంత్రం ఓ పలకా, బలం తెప్పించి మర్నాడు పాప రాగానే ఇచ్చింది.

"నా కొద్దు-మా అమ్మ కోప్పడుతుంది" అంది పాప. అంత పేదరికంలో కూడా అంత చిన్న పాపని, అంత క్రమశిక్షణలో పెంచుకున్న ఆ తల్లిపట్ల ఎంతో గౌరవం కలిగింది భారతికి.

"అమ్మ కోప్పడదులే. ఊరికెళ్ళిందన్నావుగా? వచ్చాక మీ అమ్మనడిగి కొత్త పలక కొనుక్కుని ఇది నా కిచ్చేద్దువు గాని అప్పటిదాకా రాసుకో" నవ్వుతూ చెప్పింది భారతి. తలాడించి తీసుకుంది పాప. చురుగ్గా అక్షరాలు దిద్దుతూ వారం రోజుల్లోనే చాలా అక్షరాలు నేర్చేసుకుంది.

కాస్త పెద్ద పిల్లలకు డిక్టేషన్ చెప్తోంది భారతి.

"కాకి, ఊయల, పాప, బావి, గిలక, అమ్మ" అక్షరాలు దిద్దుతున్న పాప చివాల్న తలెత్తి చూసి పరుగున భారతి దగ్గరకు వచ్చింది.

"ఏమిటి?" అడిగింది భారతి. "నేనూ అమ్మ రాస్తా నేర్పవా?" అని అడిగింది.

"అప్పుడే కాదు. ముందు అక్షరాలు నేర్చుకోవాలి. ఆ తరువాత గుణింతాలు, అప్పుడు మాటలు నేర్పుతా" అంది భారతి. కానీ పాప వినలేదు. పంతం పట్టి కూర్చుంది.

"సరే రా" అని పలక మీద అమ్మ రాసి ఇచ్చింది.

ఆ రోజల్లా 'అమ్మ', 'అమ్మ' అనుకుంటూ దిద్దింది పాప.

ఈ పాపకి ఉన్నంత అమ్మ పిచ్చి ఇంకెవరికీ ఉండదు బాబూ! అనుకుంది భారతి. 'నీకు మీ అమ్మంటే చాలా ఇష్టమా?" అని అడిగింది.

కిల కిల నవ్వింది పాప. "అవును" అంది సంబరంగా. భారతి స్కూలు చక్కగా సాగిపోతోంది. దసరా పండుగ దగ్గర పడుతోంది. వరండాలో కూర్చుని ఉత్తరం రాసుకుంటోంది భారతి. పాప వచ్చింది. ఏంటది? కుతూహలంగా అడిగింది. "ఉత్తరం". "ఉత్తరం అంటే" కుతూహలంగా అడిగింది.

"ఉత్తరం అంటే, మన బంధువులు, స్నేహితులు ఎవరైనా ఊళ్ళలో ఉంటారు కదా వాళ్ళని మనం చూళ్ళేం కదూ! అందుకని ఇలా ఉత్తరం రాస్తే అది వాళ్ళకి చేరుతుంది. మనం చెప్పాలనుకున్నవి అన్నీ ఇందులో రాసేయెచ్చు!" వివరంగా చెప్పింది భారతి.

"ఓ" అంటూ బుర్రాడించింది పాప. "ఎవరికి రాస్తున్నావు?"

"మా అమ్మకి".

"ఏమని రాస్తున్నావ్?"

"దీపావళి పండక్కి రమ్మని రాస్తున్నా!"

"రాస్తే వస్తుందా?"

"తప్పకుండా వస్తుంది!" మాట్లాడుతూనే ఉత్తరం రాయటం ముగించి ఇన్‌లాండ్ మడిచేస్తోంటే 'అరే! అలా నలిపేస్తావేం?" అడిగింది పాప.

"నలపడం కాదు. ఇలా మడత పెట్టి ఇక్కడ అడ్రెస్ రాయాలి. అడ్రెస్ అంటే మా అమ్మకి రాస్తున్నాను కదా. ఆవిడ పేరు రాయాలన్నమాట". మరింత వివరంగా చెప్పింది భారతి. కళ్ళు విప్పార్చుకుని చూసింది పాప. శ్రద్ధగా వింది.

దసరాకి పిల్లలకి వారం రోజులు సెలవులు ఇచ్చింది భారతి. మళ్ళీ స్కూలు మొదలు పెట్టగానే స్వీట్, హాట్ చేయించి పెట్టాలి అనుకుంది. అనుకుందేగాని పండుగకి ఒకరోజు ముందే జ్వరంతో పడకపెట్టింది.

ముందు మామూలు జ్వరం అనుకున్నారు గానీ తరువాత టైఫాయిడ్ అని తెలిసింది. భారతి తల్లి ఊరునుంచి వచ్చింది. ఆనంద్ సెలవు పెట్టి భార్య పక్కనే కూర్చున్నాడు. వారం రోజుల తరువాత జ్వరం తగ్గింది. బాగా నీరస పడిపోయింది భారతి.

"పిల్లలు వచ్చారా అమ్మా? వాళ్ళకేం చెప్పారు?" పక్కనే కూర్చుని పళ్ళరసం తీస్తున్న తల్లిని అడిగింది.

"వచ్చారు. నీకు జ్వరం వచ్చిందనీ, తగ్గాక మళ్ళీ కబురు చేస్తామనీ చెప్పి పంపించాడు అల్లుడు" అంది ఆవిడ.

"ఎవరో పాపట. నీకోసం ప్రతిరోజూ వచ్చేది! అబ్బ ఏం మాట్లాడుతుందో! వాగుడుకాయ".

పళ్ళరసం అందిస్తూ చెప్పింది. చిన్నగా నవ్వింది భారతి. "ఏం చెప్పింది?" అడిగింది.

"తోటమాలి వెనకబడి ఊరికే విసిగిస్తుంటే విసుక్కున్నాడు వాడు. అమ్మగారికి జ్వరం తగ్గేదాకా రాకు నువ్వు అన్నాడుట. నా దగ్గరికి వచ్చి చెప్పింది. వాళ్ళ అమ్మకి ఉత్తరం రాసిందట. దీపావళికి వస్తుందిట వాళ్ళమ్మ. నీతో చెప్పమంది" అంది ఆవిడ.

"ఈసారి వస్తే నా దగ్గరికి తీసుకురండి" అని చెప్పింది భారతి. కానీ పాప రాలేదు.

దీపావళి పండుగ నాలుగు రోజుల్లో వచ్చేసింది. కొద్దిగా కోలుకున్న భారతి ఉత్సాహంగా పండగ పనులు మొదలుపెట్టింది. తల్లి వారించినా వినకుండా పని వాళ్లను వెంట పెట్టుకుని ఇంటి బూజులు దులిపించే కార్యక్రమం మొదలు పెట్టింది.

వాకిట్లో వరండా వైపునున్న కిటికీలో పడివున్న ఉత్తరం భారతి కంట పడింది. ఇన్‌లాండ్ కవరు. యథాలాపంగా తీసి చూసింది. ఎవరిదో పాత ఉత్తరం. దానిమీద అక్షరాలు అలుక్కుపోయాయి. మట్టికొట్టుకుపోయి ఉంది. అడ్రస్ జాగాలో 'అమ్మ' అని రాసి ఉంది. ఆ రాత గుర్తే భారతికి, పాపది.

తెల్లబోయిన భారతికి ఒక్క క్షణంలో అంతా అర్థం అయిపోయింది. పాప వాళ్ళ అమ్మకి రాసిన ఉత్తరం ఇదా! ఏ రోడ్డు మీదో కనిపించిన పాత ఉత్తరం తీసుకుని దానిమీద అమ్మ అని రాసి ఇక్కడ పడేసింది? వెర్రి పిల్ల! కలుక్కుమంది భారతి మనస్సు.

వెంటనే పాపని చూడాలనిపించింది. లోపలికి వెళ్ళి చెప్పులు వేసుకుని పర్స్ తీసుకుని బయలుదేరింది. ఎక్కడికమ్మా? అడిగింది పని మనిషి. 'ఇప్పుడే వస్తా' అనేసి వెళ్ళిపోయింది.

రిక్షామాట్లాడుకుని పాప ఎపుడో చెప్పిన గుర్తుల ప్రకారం వెతుక్కుంటూ గుడి దగ్గరకు వెళ్ళింది. గుడి దగ్గర రిక్షా దిగి డబ్బులిచ్చి పంపేసి చుట్టూ చూసింది. గుడికి అంతదూరంలో చెట్టుకింద గోనె సంచీ పరుచుకొని ఎదురుగా ఓ చెక్కపెట్టెలో నూజీడీలు. చౌకరకం చాక్లెట్లు, బఠానీలు పెట్టుకు కూర్చుని ఉన్నాడు ఓ ముసలతను. అరవై ఏళ్ళుంటాయి. మురికిగా ఉన్న పంచె, దాని మీద ఖాకీ షర్టు. నేరుగా అతని దగ్గరికి వెళ్ళింది భారతి.

ప్రశ్నార్థకంగా చూశాడతను. "తాతా ఇక్కడెక్కడో ఓ చిన్నపిల్ల ఉండాలి. వాళ్ళిల్లు ఎక్కడో మీకు తెలుసా?" ఆత్రంగా అడిగింది.

ఫకాల్న నవ్వేడు తాత. "బోలెడంత మంది పిల్లలున్నారమ్మా. ఎవరిల్లు కావాలి?" నవ్వుతూనే అడిగాడు.

నిస్సహాయంగా చూసింది భారతి. "చిన్నపిల్ల నాలుగేళ్ళుంటాయి. సన్నగా ఉంటుంది. పేరు పాప. వాళ్ళ అమ్మ ఆ..... ఊరెళ్ళింది" తనకు తెలిసిన వివరాలు గబగబా చెప్పేసింది.

"ఓ ఆ పాపా? ఆ పాప తాతనమ్మా నేను. మీరు భారతమ్మగారా?" అన్నాడు తాత.

"అవును తాతా!" అంది భారతి. "పాప మీ గురించి ఎప్పుడూ చెప్తూ ఉంటుంది" అన్నాడు.

"పాప ఏది తాతా? పాపా వాళ్ళ అమ్మ ఊర్నించి వచ్చిందా?" ఆత్రంగా అడిగేసింది.

చిన్నగా నవ్వాడు తాత. "ఎక్కడి నుండి వస్తుందమ్మా పాపతల్లి? పాప అనాథ. ఏ తల్లో మెట్లమీద వదిలేసి పోయింది. పసికూన ఏడుపు విని వెళ్ళి చూశాను నేను. వెంటతీసుకొచ్చాను. అప్పట్లో నా కూతురు పురిటికి వచ్చింది. ఈ పాపకు కూడా అదే పాలిచ్చింది. తరువాత నాకు చేతనయినట్లు పెంచాను. కడుపు కింత పెట్టాను. నాకూ, దీనికీ ఏ ఋణమో నా పాల పడింది" అన్నాడు.

నిర్ఘాంతపోయింది భారతి. "మరి ఎప్పుడూ వాళ్ళమ్మని తల్చుకుంటుందేం? మాటలను విని పాపకి వాళ్ళమ్మ దగ్గర చాలా చనువని అనుకున్నాను నేను" అంది. ఇది నమ్మనట్లు.

మళ్ళీ నవ్వాడు తాత. "నిజమేనమ్మా. పాపకి అమ్మంటే ఎంతో ఇష్టం. ఇష్టం కాదు– పిచ్చి ప్రేమ. చిన్నతనంలో అది నోరు తెరిచి మాట్లాడింది మొదటి మాట

అమ్మ. ఎంత అల్లరి చేస్తున్నా 'అదుగో అమ్మవస్తుంది నిన్ను కోప్పడుతుంది' అంటే టక్కున ఆపేసేది. నా కూతురిని దాని కొడుకుని చూసేది కదా.

చిన్నతనాన 'అమ్మేది?' అని అడిగింది. నిన్ను వదిలేసి వెళ్ళిపోయింది అని చెప్పలేక ఊరికెళ్ళిందమ్మా అని చెప్పాను. నమ్మేసింది. 'ఎప్పుడొస్తుంది?' అని అడిగేది. సంకురాత్రికి వస్తుంది, 'కొత్త అమావాస్యకి వస్తుంది' అని ఏదో నోటికొచ్చింది చెప్పేవాడిని. ఇప్పటికీ అంతే. అలాగే చెప్తాను. ఆశగా చూస్తుంది. గడువుదాటాక రెండ్రోజులు ఏడిచి ఊరుకుంటుంది. మళ్ళీ మొదలు. ఏమిటో వెర్రితల్లి... అన్నాడు తాత.

నిలువునా నీరైపోయింది భారతి. 'పాపేది తాతా' అడిగింది.

"ఇందాక గుళ్ళోకి వెళ్తుంటే చూశాను!" అన్నాడు తాత. గిర్రున వెనక్కి తిరిగి వేగంగా గుళ్ళోకి వెళ్ళింది భారతి. ఎక్కువ శ్రమ పడకుండానే కనిపించింది పాప.

పిల్లని వెంట బెట్టుకుని గుడికి వచ్చిందొకావిడ. ఆ పాపని ఎత్తుకుని గంట కొట్టించి గుడి ముందు కూర్చుని ఒళ్ళో కూర్చో పెట్టుకుని ప్రసాదం నోటి కందించింది ఆవిడ. ఏదో అంది పాప, నవ్వుతూ పాప బుగ్గలు ముద్దు పెట్టుకుంది ఆవిడ.

ధ్వజస్తంభానికి ఆనుకుని నిలబడి నోట్లో వేలు పెట్టుకుని ఆశగా సర్వం మరిచి పోయి దీక్షగా వాళ్ళవంక చూస్తోంది పాప. భారతి కళ్ళవెంట గిర్రున నీళ్ళు తిరిగాయి.

వెంటనే వెళ్ళి పాప భుజం మీద చెయ్యి వేసింది. ఉలిక్కిపడి చూసింది పాప. వెంటనే ముఖం కళకళ లాడింది.

"నీ జ్వరం తగ్గిపోయిందా?" అడిగింది.

"తగ్గిపోయిందమ్మా!" చెప్పింది భారతి.

"నీకు తెలుసా? దీపావళికి మా అమ్మ ఊర్నించి వచ్చేస్తోంది. నేను కూడా ఉత్తరం రాసేశాగా!" ఉత్సాహంగా చెప్పింది పాప.

వెంటనే చేతులు చాచి పాపను గుండెలకు హత్తుకుంది భారతి.

"పాపా! నేనే మీ అమ్మని. నీ కోసం వచ్చేశాను" అంది ఆవేశంగా.

తెల్లబోయింది పాప. "నువ్వు అమ్మవా? కాదు మా అమ్మ ఊరెళ్ళింది" అంది.

"కాదమ్మా. నేనే మీ అమ్మని. ఊర్నించి నీ కోసమే వచ్చాను. నీకోసం వెతుకుతున్నాను. మరి నేను ఊరికెళ్ళినపుడు నువ్వు చాలా చిన్న పాపాయివి. ఇప్పుడేమో పెద్ద దానవయ్యావు కదా! అందుకే గుర్తు పట్టలేక పోయాను".

ఇంకా అపనమ్మకంగా చూస్తోంది పాప. నిస్సహాయంగా తలెత్తిన భారతికి ఎదురుగా తాత కనిపించాడు. వెర్రిదానిలా అతని దగ్గరకు పరిగెత్తింది.

"తాతా! పాప నా మాట నమ్మటం లేదు. నువ్వైనా చెప్పు. నేను పాపకి అమ్మని కదూ! పాప అమ్మని నేనేకదూ?" కళ్ళవెంట నీరు కారి చెంపలను తడిపేస్తుండగా చేతులు జోడించి ప్రశ్నిస్తున్న భారతి వంక నిశితంగా చూశాడు తాత. ఆ కళ్ళలోని అర్థింపుని గుర్తించాడు.

"అవును తల్లీ! పాపకు తల్లివి నువ్వే. పాపా ఇదుగోనమ్మా మీ అమ్మ" అన్నాడు. నిర్ఘాంతపోయి నిలుచుండిపోయింది పాప. ఆ కళ్ళలో వెయ్యి మెరుపులు మెరిశాయి. "పాపా" దగ్గరగా వెళ్ళి భుజం మీద చెయ్యివేసింది భారతి. వెలిగిపోతున్న పాప ముఖంలో ఒక్కసారి కోపం భయం అలుముకున్నాయి.

ఆ చెయ్యి విదిలించి కొట్టి దూరంగా వెళ్ళిపోయింది. "ఫో నీతో నేనసలు మాట్లాడను. నన్నొదిలేసి ఊరికెందుకెళ్ళావ్?" నిలదీసి అడిగింది.

కన్నీళ్ళతోనే నవ్వింది భారతి. "పొరబాటు అయిపోయిందమ్మా! ఇంకెప్పుడూ వెళ్ళనుగా" బతిమాలింది. కానీ పాప లొంగిరాలేదు. మూతి బిగించుకుని తన నిరసనను తెలియజేసింది. ఎంతగానో బుజ్జగించింది భారతి. అయినా పాప లొంగిరాలేదు.

"పో అయితే. నాక్కోపం వచ్చిందంటే మళ్ళీ వెళ్ళిపోతాను జాగ్రత్త" ఆఖరి అస్త్రం ప్రయోగించింది భారతి.

అదిరిపడింది పాప! ఆ కళ్ళు భయంతో రెపరెపలాడాయి. ఒక్క పరుగున వచ్చి భారతి మెడచుట్టూ చేతులు వేసి గుండెలకు హత్తుకుపోయి బావురుమంది. "అమ్మ వెళ్ళొద్దమ్మా!"

భారతి మనసు నిలువెల్లా పులకించి పోయింది. అందీ అందక చేజారిపోయిన మాతృత్వంలోని మాధుర్యం తనివితీరా చవిచూస్తూ పాపను గాఢంగా హత్తుకుంది. "వెళ్ళను తల్లీ వెళ్లను" అని మాట ఇచ్చేసింది.

*ఆంధ్రప్రభ వారపత్రిక 11 ఫిబ్రవరి, 1987*